**కథ**

# విముక్తి

**నూతి చప్టామీద కూర్చుని గిన్నెలు తోముతోంది అవంతి. ఆమె చేతుల రాపిడికి స్టీలుగిన్నెలు వెండిగిన్నెల్లా ఇత్తడి గిన్నెలు బంగారంలా మెరిసిపోతున్నాయి. కాని, గత ఆరు నెలలుగా గిన్నెలు తోమితోమి గులాబీరేకుల్లాంటి ఆమె చేతులు నల్లబారిపోయాయి. ఎండలో పనిచెయ్యడం వలన ఆమె పసిడి దేహకాంతి కగ్గిన బంగారంలా మారింది.**

యాంత్రికంగా గిన్నెలు తోముతోందన్నమాటేగాని ఆమె మనసు శ్రీహరి చుట్టూ పరిభ్రమిస్తోంది.

"మీరు కంప్యూటర్ కోర్సు చెయ్యవచ్చుగా! చదువుకున్న మీరు మిషన్ కుట్టి డబ్బు సంపాదించడమేమిటి? మీకున్న డిగ్రీకి కంప్యూటర్ పరిజ్ఞానం తోడయితే మంచి ఉద్యోగమే దొరుకుతుంది."

'నిజమే తను కంప్యూటర్ కోర్సు చేస్తే బాగుంటుంది'. అవంతిలో శ్రీహరి రేకెత్తించిన ఆలోచనకి ఆశ ఊపిరిపోసింది. కాని అత్తగారు ఏమంటారో? మామగారు అభ్యంతరపెడతారేమో! అన్నింటికంటే ముఖ్యంగా డబ్బు? డబ్బు లేకపోబట్టే కదా తను పుట్టింటి వాళ్ళకి బరువై అత్తింటికి బానిస అయింది? తన ఆశలు, కలలు అన్నీ భర్త మరణంతోనే సమాధి అయిపోయాయి. చక్రపాణి చనిపోయి ఆరు నెలలు. తను అత్తవారింట్లో బానిసగా మారి ఆరునెలలు.

"ఎంతసేపే గిన్నెలు తోమడం? లోపలికి వచ్చి తగలడు. మీ మామగారు స్నానానికి వస్తున్నారు

"అయిపోయిందత్తయ్యా!" అవంతి గబగబా గిన్నెలు కడిగి వంటింట్లో పెట్టి వచ్చింది. నూతి చప్టా మీద మెతుకులు లేకుండా శుభ్రంగా కడుగుతుంటే మరోసారి అత్తగారి గర్జన వినిపించి గభాల్న ఇంట్లోకి వచ్చి పడింది.

ప్రొద్దుట లేవగానే వితంతువైన తన ముఖం చూస్తే అరిష్టమనే మామగారు ప్రగాఢ నమ్మకం! ఆయన నిద్ర లేవగానే ముందు దేవుడి ముఖం తర్వాత అత్తగారి ముఖం చూసాకే బయటకి వస్తాడు. అయినప్పటికి తను అంత ప్రొద్దుటే ఆయన కంట పడకూడదు.

సాధారణంగా అవంతి ఉదయం అయిదు గంటలకే లేచి గిన్నెలు తోమి పాచి పనులు పూర్తి చేస్తుంది. ఆరోజు ఒక అరగంట ఆలస్యమయింది.

"బారెడు పొద్దెక్కి లేచి అందరికీ నీ ముఖం చూపించే బదులు ఒక గంట ముందు లేచి చావవచ్చుగా?" అత్తగారు రుసరుసలాడుతూ కాఫీ గ్లాసు టక్కున ఆమె ముందు పెట్టింది.

"రాత్రి నిద్ర పట్టలేదత్తయ్యా!" సంజాయిషీ ఇస్తున్నట్టు అంది అవంతి.

"ఎలా పడుతుంది? ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోతుంటే?" వ్యంగ్యంగా అంది శ్యామలాంబ.

అవంతి మౌనంగా అత్తగారి వ్యంగాన్ని భరించి కాఫీ తాగడం మొదలుపెట్టింది. 'ప్రొద్దుటే తన ముఖం ఎవరూ చూడకూడదా? బొట్టులేని తన ముఖాన్ని చూస్తే అరిష్టమా?' ఆమె మనసుని ముల్లుతో పొడిచిన బాధ.

గతంలో తన శకునాన్ని శుభశకునంగా భావించే అత్తమామలకి తను ఇప్పుడు అశుభంగా అన్పిస్తోందా?

మామగారి స్నానం పూర్తయ్యేలోగా అవంతి గదులన్నీ శుభ్రంగా వూడ్చి తడిబట్టతో తుడిచింది. శ్యామలాంబ భర్త పూజ కోసం అన్నీ సిద్ధం చేసింది.

మామగారు తడిబట్టలతో లోపలకి రావడం చూసి అవంతి గభాల్న లోపలకి వెళ్ళిపోయింది.

పదిగంటలకల్లా ఆ ఇల్లు నిశ్శబ్దమయిపోతుంది. స్కూల్లో హెడ్మాస్టరుగా పనిచేస్తున్న మామగారు పది గంటలకే భోజనం చేసి వెళ్తాడు. శ్యామలాంబ భర్తతో బాటు తినేస్తుంది. అత్తమామలు తినగా మిగిలిన చప్పగా చల్లారిన పదార్థాలనే అవంతి ఆవురావురుమంటూ తింటుంది. ప్రొద్దుట ఎప్పుడో అత్తగారిచ్చిన చిన్న గ్లాసెడు కాఫీ. నిర్విరామమైన చాకిరీ. విశ్రాంతి ఎరుగని జీవితం. అన్నం తిని గిన్నెలన్నీ బయట వేసి వంటిల్లు కడిగేసరికి నిద్రముంచుకొస్తుంది. అవంతి ఒక్క నిముషం అలసట తీర్చుకోడానికి నడుము వాలిస్తే చాలు శ్యామలాంబ చిరచిరలాడుతుంది.

"నిర్భాగ్యుడికి నిద్ర దరిద్రుడికి ఆకలి ఎక్కువనే సామెత నిన్ను చూసే పుట్టి వుంటుంది. పగటి నిద్ర పనిచేటన్నారు. రాఘవయ్యగారి కోడలు వూరికెళ్తోందట. జాకెట్లు సాయంకాలానికల్లా ఇమ్మని చెప్పింది. లేచి కుట్టు" అత్తగారి సాధింపుతో అవంతి నిద్రమత్తు వదులుతుంది. లేచి మిషన్ ముందు కూర్చుంటుంది. సాయంకాలం దాకా మిషన్ కుట్టి అలిసిపోయిన ఆమె అత్తగారు వంట చేసే వేళవుతోందని గుర్తు వచ్చి లేచి అంట్లు తోమడం మొదలుపెడుతుంది. మళ్ళీ రాత్రి పొద్దుపోయే దాకా జాకెట్లకి హుక్స్ కుట్టి అందరూ పడుకున్నాక పడుకోడం. ఇంత కష్టపడినా ఆమెకి తను సంపాదించే డబ్బుపై హక్కు లేదు. ప్రతీ రూపాయి అత్తగారు లాగేసుకుంటుంది.

రోజూలాగే అవంతి కంచం ముందు కూర్చుంది. కాని ఆమెకి అన్నం తినబుద్ధి కావడం లేదు. 'ఎన్నాళ్ళిలా?' అనే ప్రశ్న కొత్తగా ఆమె మనసులో ఉదయించింది. ఎవరి ఆదరణకి నోచుకోకుండా తనెందుకు బానిసలా పడివుండాలి? శ్రీహరి చెప్పినట్టు కంప్యూటర్ కోర్సులో జాయినైతే? తను తెలివితక్కువదేమీ కాదు. చదువుకునే రోజులలో క్లాసులో ఫస్టు వస్తూండేది. అవంతి అత్తగారినడిగి కంప్యూటర్ కోర్సులో జాయినవాలని నిశ్చయించుకుంది. ఆమెకి మనసులో ఆరాటంగాను అశాంతిగానూ వుంది. తింటున్న అన్నం చేదుగా అన్పించింది. ఆమె నిండు కంచంలో చెయ్యి కడిగేసుకుని, గిన్నెలన్నీ అవతల పెట్టి వంటిల్లు కడిగేసింది.

హాలులోకి వచ్చి అత్తగారి దగ్గర నిలబడింది. శ్యామలాంబ వత్తులు నలుపుతూనే కునికిపాట్లు పడుతోంది.

"అత్తయ్యా!" అవంతి మెల్లిగా పిలిచింది. కోడలిని చూడగానే ఆవిడ ముఖంలో అసహనం, చిరాకు పిలిచినట్టే వచ్చేసాయి.

అవంతి నేల చూపులు చూస్తూ అంది. "నేను..నేను కంప్యూటర్ నేర్చుకుంటానత్తయ్యా!" ఆ రెండు మాటలూ చెప్పడానికి ఆమె ఒంట్లోని శక్తినంతటినీ కూడదీసుకోవలసి వచ్చింది.

"ఏమిటీ!" వినకూడనిదేదో విన్నట్టు వెడల్పయిన కళ్ళతో తీక్షణంగా చూసిందావిడ.

అవంతి గొంతు తడారిపోయింది. తన ప్రయత్నానికి అత్తగారి నుంచి వ్యతిరేకత ఎదురవుతుందని ఊహిస్తూనే వుంది.

శ్యామలాంబ ఏదో అర్థమయినట్టు "తెలిసింది. ఇది నీకు పుట్టిన బుద్ధి కాదు. ఆ శ్రీహరి నిన్ను ప్రేరేపించాడు. నువ్వు 'సై' అంటున్నావు. ఈ మాట మీ మామగారితో చెప్పు ఆయన సంతోషిస్తారు"

తను కంప్యూటర్ నేర్చుకోవడం వలన ఎంత మంచి ఉద్యోగం వస్తుందో చెప్పాలనుకుంది అవంతి. కాని అత్తగారి చూపులలోని నిరసన చెయ్యకూడని పనేదో చేస్తున్నట్టు తనని ఆవిడ చూసే చూపులు ఆమెని మూగదాన్ని చేసేశాయి. గత కొద్ది రోజుల నుండీ మనసులో కొట్టుమిట్టాడుతున్న మాటలని అత్తగారితో చెప్పడానికి ఎంత ధైర్యాన్ని కూడదీసుకోవలసి వచ్చిందో ఆవిడ అయిష్టతని వ్యక్తం చేసాక, తను పొందిన నిరాశని భరించడానికి అంతకు రెట్టింపు మనస్థైర్యాన్ని కూడదీసుకోవలసి వచ్చింది.

'ఈ ఇంట్లో గానుగెద్దులా చాకిరీ చేస్తూ పరాధీనలా ఎన్నాళ్ళు బ్రతకాలి?' ఆమెకి తన భవిష్యత్తు అంధకారబంధురంగా అన్పించింది.

అత్తగారి స్వరం వినిపిస్తూనే వుంది.

"పెళ్ళయిన ఆరు నెలలకే మొగుడు ఛస్తే మూలన పడి కూర్చోక ఇది కంప్యూటర్ నేర్చుకుంటుందిట. ఇవాళ కంప్యూటర్ నేర్చుకుంటానంటుంది. రేపు ఉద్యోగం చేస్తానని వీధిలో పడుతుంది."

అవంతికి తన మీద తనకే జాలి అన్పించింది. తనకేం కావాలో తెలిసినా వ్యక్తం చెయ్యలేని తన అసహాయతపై జాలి. అత్తమామల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బ్రతకవలసిన తన దుస్థితిపై జాలి.

సాయంకాలం మామగారు ఇంటికి రాగానే అత్త

గారు పెద్దస్వరంతో తను కంప్యూటర్ క్లాసులో చేరతాన నడం గురించి చెప్పడం విన్పిస్తోంది అవంతికి.

"ఈ ఆలోచన అవంతికే వచ్చిందా? లేక దీని వెనుక ఎవరి ప్రోద్బలమైనా వుందా?" ఆయన స్వరంలో అనుమానం.

"ఉన్నాడుగా శ్రీహరి! వాడు వారం క్రిందట మన ఇంటికి వచ్చినప్పుడు మాటల సందర్భంలో అన్నాడు. ఈవిడగారు ఆ మాట పట్టుకుంది."

"శ్రీహరా? వాడు ఎందుకొస్తున్నాడు మనింటికి?"

"ఏమో? ఎవరికి తెలుసు?"

"చక్రపాణి మరణంతోనే వాడికి, ఈ ఇంటికి వున్న అనుబంధం తెగిపోయిందని, ఈ ఇంటికి వాడు రానవ సరం లేదని వాడితో చెప్పు" "పోనీ, శ్రీహరి మన మీద అభిమానంతో మన ఇంటికి వచ్చాడే అనుకోండి. మొగుడి స్నేహితుడితో ఈవిడగారికి మంతనాలేమిటి?"

"వాడిని ఇంక మీదట ఈ ఇంటికి రానివ్వకు. అంతే కాదు. ఈ ఇంటి ఆడవాళ్ళు చదువు, ఉద్యోగం పేరుతో బజారుకి ఎక్కక్కర్లేదని నీ కోడలితో చెప్పు" మామగారి కఠిన స్వరం శాసి స్తున్నట్టుంది.


అత్తగారి మాటలలో 'మొగుడి స్నేహితునితో మంతనాలు' అనే మాట అవంతిని జుగుప్సతో ముడుచుకుపోయేలా చేస్తోంది.

★★★

శ్యామలాంబ పక్కింటావిడ కూతురికి పురిటి నెప్పు లొస్తుంటే ఆస్పత్రికి ఆవిడతో సాయం వెళ్ళింది. చాలా రోజుల తరువాత దొరికిన ఒంటరితనం. ముఖ్యంగా తను ఏ పనిచేస్తున్నా డేగ కళ్ళతో చూస్తూ వుండే అత్తగారు ఇంట్లోలేకపోవడం...స్వేచ్ఛ..కావలసినంత స్వేచ్ఛ. గుండె లనిండా గాలి పీల్చుకున్న అవంతి గదిలో మంచం మీద పడుకుంది. క్షణాలలో గాఢ సుషుప్తిలోకి జారుకుంది.

అలా ఎంతసేపు పడుకుందోగాని, కాలింగ్‌బెల్ మోతతో మెలుకువ వచ్చింది. ఎవరో ఇంటికి వచ్చారు. తలుపు తియ్యమని మనసు చెబుతోంది. కాని, శరీరం లేవడానికి సహకరించడం లేదు. కనురెప్పలు విడివడనం టున్నాయి. కొన్ని క్షణాల తరువాత బెల్ మళ్ళీ మోగింది. అత్తగారు హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చిందేమో అని స్ఫురించగానే ఒక్క ఉదుటున లేచి కూర్చుంది. పగటి పూట నిద్రపోతున్నందుకు ఎన్ని సహస్రనామార్చనలు పెడుతుందో అవిడ. ఆమె గుండె గుబగుబలాడింది. చల్లని నీళ్ళు ముఖాన చల్లినట్టే నిద్రమబ్బు ఎగిరిపో యింది. నిద్రలో చెదిరిన జుట్టుని, బట్టలని సరుకుని లేచి వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా చిరునవ్వుతో శ్రీహరి.



అతన్ని చూడగానే ఆమె గుండె క్షణం కొట్టుకోడం ఆగినట్టయి మళ్ళీ రెట్టింపు వేగంతో కొట్టుకోడం మొదలుపెట్టింది.

మొగుడి స్నేహితునితో మంతనాలే మిటి? అత్తగారి స్వరం వ్యంగ్యంగా విని పించిందామె చెవులలో.

"ఇంట్లో ఎవరూ లేరండి" అంది అతని వైపు చూడకుండానే.

"భలేవారే! ఎవరూ లేరంటారేమిటండీ? మీరు న్నారుగా?" అన్నాడతను వరం డాలో వున్న కుర్చీలో కూర్చుంటూ.

'అతనిక్కడ వుండగా అత్తగారు ఇంటికొస్తే?' ఆ ఊహకే అవంతి ఒళ్ళంతా చెమటలు పట్టేసాయి.

"ఏం నిర్ణయించుకు న్నారు" అడిగాతడను.

"నిర్ణయమా?" అవంతికి అతనే విషయాన్ని గురించి అడుగుతున్నాడో అర్థం కాలేదు.

"అదే మీరు కంప్యూటర్ క్లాసులో జాయినవడం గురించి.."

"మా అత్తగారికి మామగారికి ఇష్టం లేదు."

"అంటే! మీకిష్టమే కదా?"

"నా ఇష్టాయిష్టాల ప్రసక్తి అనవసరం"

"మీ జీవితం మీ ఇష్టం. మీ భవిష్యత్తుకి పునాది వేసు కోవడానికి అవకాశాలను వెతుక్కోకుండా కుట్టు పని చాలు అని తృప్తిపడతారేమిటండీ?"

"ఆశలున్నా అవి తీరే మార్గం వుండాలండీ! ముఖ్యంగా డబ్బు! ఏం నేర్చుకోడానికైనా డబ్బు వుండాలి."

"నేను చదివిస్తాను మిమ్మల్ని"

"మీరా?" ఆమె కళ్ళలో సంభ్రమం కదలాడింది. "మీరు..నేను..నాకు.." తడ బాటుగా ఆగిపోయింది.

"నేను మీకేమవుతానని మీ ప్రశ్న! మనిషికి మనిషికీ మధ్య ఏర్పడే అనుబంధాలకి బంధుత్వమే వుండనవసరం లేదు" అతడి స్వరంలోని ఆప్యాయతాభిమానాలకి అవంతి కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి.

'శ్రీహరి తనని పలుకరిస్తేనే పెడర్థాలు తీసిన అత్త గారు ఇప్పుడతను తనని చదివిస్తానంటే మరింత వికృ తంగా మాట్లాడదూ?'

"నాపై మీకున్న అభిమానానికి కృతజ్ఞురాలిని. అందని వాటికోసం అర్రులు చాచి, వున్న నీడని పోగొట్టు కోలేను. నన్నిలా బ్రతకనివ్వండి చాలు." చేతులు జోడిస్తూ అని వెనుదిరిగి లోపలికి వెళ్ళిపోయింది. ఆమెకి దుఃఖం ముంచుకురాగా వంటగదిలోకి వెళ్ళి కరువుతీరా ఏడ్చింది.

హోతా పద్మినీదేవి

కొద్ది క్షణాల తరువాత అతనక్కడ నుంచి లేచి వచ్చే సాడు.

★★★

శ్రీహరి తన దగ్గర పెళ్ళి ప్రస్తావన తెస్తాడని ఊహించని అవంతి నిశ్చేష్టురాలయింది. ఆశ్చర్యం, అపనమ్మకం దిగ్భ్రమ ఇత్యాది భావాల సమ్మిళితంగా వుందామె ముఖం.

"ఛాందస్తులైన మీ అత్తమామలు మన పెళ్ళికి అంగీకరించరని నాకు తెలుసు. నాకు కావలసినది మీకు ఇష్టమా కాదా అనే విషయం. దీనికి జవాబు బాగా ఆలోచించుకునే చెప్పండి. మిమ్మల్ని పూల మీద నడిపిస్తానని వాగ్దానం ఇవ్వలేను కాని, నన్ను పెళ్ళి చేసుకున్నందుకు మీరు ఎప్పుడూ బాధపరని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. నన్ను నిరాశపరచరనే నమ్ముతున్నాను" అతను చకచక నడుస్తూ వెళ్ళిపోయాడు.

అవంతి కలలో నడుస్తున్న వ్యక్తిలా లోపలకి వచ్చింది. ఆమె ఒంట్లోని రక్తమంతా ముఖంలోకి వచ్చి చేరింది.

'శ్రీహరి తనని పెళ్ళి చేసుకుంటానని ఎంత ధైర్యంగా చెప్పాడు? అసలా ఉద్దేశం మనసులో పెట్టుకునే తమ ఇంటికి రాకపోకలు సాగిస్తున్నాడా?' ఆమెకి సిగ్గుతో ప్రాణం పోతున్నట్టు వుంది.

ఆమెకి భర్త గుర్తు వచ్చాడు. అతనితో ఆరు నెలల సహజీవనం గుర్తుకొస్తోంది. పెళ్ళయిన తొలి రోజులు అందరికీ ఎంత వేగంగా గడిచిపోతాయో తనకీ అంతే వేగంగా గడిచిపోయాయి. అతని ప్రతీ చర్యలో ఉద్రేకం, వాంఛ తప్ప ప్రేమ లాలన ఈషణ్మాత్రం కనిపించేవి కావు. అతని ఇష్టాలను అమలు చెయ్యడం, తప్ప తన ఇష్టాయిష్టాలకు ప్రాధాన్యమిచ్చేవాడు కాదు. అతను తనని అర్థం చేసుకున్నాడో లేదో తెలియదు కానీ, అతన్ని తను అర్థం చేసుకోడానికి ఆ ఆరునెలల కాలం చాలలేదు.

అవంతి గతం నుంచి తేరుకుని వర్తమానానికి వచ్చింది. 'శ్రీహరి స్నేహహస్తాన్ని అందుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించడమా? లేక గానుగెద్దులా ఈ ఇంట్లో జీవితాంతం గడపడమా?' ఆమె మనసు ద్వైదీభావాలతో సతమతమవసాగింది.

శ్రీహరి ఆ ప్రస్తావన తెచ్చిన దగ్గర నుంచి అవంతి అతని ముఖంలోకి నేరుగా చూడలేకపోతోంది.

"మీ నిర్ణయాన్ని నిర్మొహమాటంగా తెలియచెయ్యండి అవంతీ! అది నాకు ఆనందాన్ని కలిగించేదయినా, ఆశాభంగాన్ని కలిగించేదైనా వినడానికి నేను సిద్ధంగా వున్నాను."

ఆమె సజల నేత్రాలలో కృతజ్ఞతతో కూడిన ఆరాధనా భావం వ్యక్తమయింది.

"దేవుడే దిగి వచ్చి అడగకుండానే వరం ఇస్తానంటే తిరస్కరించగలనా?"

శ్రీహరి ముఖం ఆనందంతో దీప్తివంతమయింది. "థాంక్యూ అవంతీ! నేను అదృష్టవంతుడిని" అతని స్వరంలో ఉద్విగ్నత.

"కానీ మీ పేరెంట్స్.."

"మా నాన్నగారు అభ్యుదయ భావాలున్న మనిషి. కందుకూరివారి ఆశయాలబాటలో నడవడం కోసం ముప్పై ఏళ్ళ క్రింటదే వితంతువైన మా అమ్మని పెళ్ళి చేసుకున్నారు. పెళ్ళి విషయంలో నాకు మా అమ్మ, నాన్నలు స్వేచ్ఛనిచ్చారు. నా ఆశయానికి వాళ్ళ ప్రోత్సాహం వుంది కూడా. మనం చెన్నై వెళ్దాం అవంతీ! అక్కడ నుంచి మధుర మీనాక్షి గుడికి వెళ్దాం. మీనాక్షి అమ్మవారి గుడిలో నీ మెడలో తాళికడతాను."

అవంతి బుగ్గలలో మందారాలు పూసాయి.

★★★

వారం తరువాత సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో ఒక కంపార్ట్‌మెంట్‌లో అవంతి, శ్రీహరి ఎదురెదురుగా కూర్చుని వున్నారు. అతను కిటికీలో నుంచి బయటికి చూస్తూ ఏదో ఆలోచిస్తుండటం గమనించి అడిగిందామె.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

"నన్ను నమ్మి నాతో వచ్చిన నీకు ఏ కష్టమూ రాకుండా ఎలా చూసుకోగలనా అని? నాకు ఉద్యోగం లేదు. కొన్నాళ్ళు మనం కష్టపడక తప్పదేమో! నీ నగలు తెచ్చావు కదూ?"

క్షణం ఆగి అడిగిందామె.

"మన పెళ్ళి మీ వాళ్ళకి ఇష్టమేనన్నారుగా? మరి మనం అందరికీ దూరంగా ఎక్కడకో వెళ్ళిపోయి రహస్యంగా పెళ్ళి చేసుకోవడమెందుకు?"

"మా వాళ్ళకి అభ్యంతరం లేకపోయినా మీ అత్తమామలు ఒప్పుకోరు కదా! మన పెళ్ళి అయ్యాక కొన్ని రోజుల తరువాత తిరిగి వస్తే వాళ్ళేమీ చెయ్యలేరు. అదీగాక పెళ్ళి ఎక్కడైనా చేసుకోవచ్చు. కాని హనీమూన్ మాత్రం జీవితాంతం గుర్తుండిపోయే మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోవాలని నా ఆశ."

తరువాత వాళ్ళిద్దరూ ఆలోచనలలో వాళ్ళు నిమగ్నమై ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు.

విజయవాడ స్టేషను సమీపిస్తోంది. అవంతి లేచి సీటు క్రింద నుంచి తన సూట్‌కేసుని బయటికి తీస్తుంటే శ్రీహరి విస్మయంగా చూస్తూ అడిగేడు.

"ఇది విజయవాడ స్టేషను. చెన్నై రావడానికి చాలా టైముంది."

"తెలుసు. నేను విజయవాడలో దిగుతున్నాను"

"ఎందుకు?"

"నేను నీతో రావడం లేదు"

"నాతో రావడం లేదా? ఎందుకని?" అదిరిపడిన అతను అప్రయత్నంగానే లేచి నిలబడ్డాడు.

"నీ నిజ స్వరూపమేమిటో తెలిసాక, నిన్ను నమ్మి నీతో ఎలా వస్తాననుకున్నావ్?"

"ఏం మాట్లాడుతున్నావు నువ్వు?"

"ఎంత బాగా నటిస్తున్నావ్ శ్రీహరీ! నువ్వు ప్లాట్‌ఫారం మీద నీ ఫ్రెండ్‌తో మాట్లాడినది నేను వినలేదనుకున్నావా? నా మెడలో తాళి కట్టి నాపై మోజు తీరాక, నన్ను ముంబయి తీసుకెళ్ళి అమ్మేద్దామనుకున్నావు కదూ? నాకు, నా దగ్గరున్న బంగారానికి బజారులో వెలకట్టి ఆ డబ్బుతో ఉద్యోగాన్ని కొనుక్కుందామనుకున్నావు కదూ? కందుకూరివారి అడుగుజాడలలో నడిచిన నీ తండ్రి కడుపున నీలాంటి నీచుడు పుట్టడం ఆయన దౌర్భాగ్యమే కాదు, ఈ దేశం చేసుకున్న దౌర్భాగ్యం కూడా. భగవంతుడు సమయానికి నా కళ్ళు తెరిపించి, నీ నిజస్వరూపాన్ని తెలుసుకునేలా చేసాడు. ఒకందుకు మాత్రం నీకు నా కృతజ్ఞతలు చెప్పకుండా వుండలేకపోతున్నాను. అత్తింటి బానిసగా బ్రతుకుతున్న నాకు నా కాళ్ళ మీద నేను నిలబడగలను అనే స్ఫూర్తిని కలిగించావు. నాలో ఆత్మవిశ్వాసాన్ని మనోధైర్యాన్ని కలిగించావు. నువ్విచ్చిన స్ఫూర్తితో నా జీవితాన్ని చక్కదిద్దుకుంటాను. గుడ్‌బై శ్రీహరీ! గుడ్ బై ఫరెవర్!" ఆత్మవిశ్వాసంతో ముందుకి సాగిపోతున్న అవంతిని పాలిపోయిన ముఖంతో చూస్తూ నిలబడిపోయాడు శ్రీహరి.

★

## జ్యోతిక తెలివి

'ఖుషీ' (తమిళం) హిట్‌తో హీరోయిన్‌గా మంచి గుర్తింపు పొందిన జ్యోతిక ఇప్పుడు తెలుగులో 'వన్ టూ త్రీ' సినిమాలో నటిస్తోంది. వేమ హీరోయిన్ వేషాలే వేస్తానని మడి కట్టుకు కూర్చోకుండా చెల్లెలు పాత్రలు కూడా వేస్తానని అంటోంది.

పరిస్థితులకు తగినట్టుగా పాత్రలందుకోవాలిగానీ, ఈ పోటీ రంగంలో నేను హీరోయిన్ వేషాలే వేస్తాను అంటే ఎలా?- అంటోంది జ్యోతిక.

-మానస

